Nabiyon-ke-Halaat-III
(Telugu)

దైవ ప్రవక్తలు

మూడవ భాగం

హజ్రత్ యూసుఫ్ (అలైహిస్సలాం) గారి జీవిత చరిత్ర

మూలం:
మౌలానా అబూ సలీం అబ్దుల్ హై

అనువాదం:
ముహమ్మద్ ఇక్బాల్ అహ్మద్

కరుణించేవాడు కనికరించేవాడు అయిన అల్లాహ్ పేరుతో

దైవప్రవక్త కాబోతున్నారు!

హజ్రత్ ఇస్హాఖ్ (అ) కుమారుని పేరు హజ్రత్ యాఖూబ్ (అ). వీరు సిరియాలోని కన్అన్ పట్టణంలో నివసించేవారు. వీరికి పండ్రెండుగురు సంతానం. వీరిలో ఒకరి పేరు హజ్రత్ యూసుఫ్ (అ). మరొకరు హజ్రత్ యూసుఫ్(అ) అన్నగారయిన బిన్ యామిన్. మిగతా పది మంది వీరి సవతి సోదరులు. ఈ సోదరులందరిలో హజ్రత్ యూసుఫ్ (అ) అందరికన్నా తెలివిగలవాడు, సద్వర్తనుడు.

హజ్రత్ యూసుఫ్ (అ)కు పదహారు, పదిహేడు సంవత్సరాల వయస్సులో ఒక రోజు ఓ కల వచ్చింది. మరునాడు ఆయన తండ్రితో, "నాన్నగారూ! రాత్రి నాకొక కల వచ్చింది. పదకొండు నక్షత్రాలు, సూర్యచంద్రులు నాకు మ్రొక్కుతున్నట్లు ఆ కలలో కనబడింది" అని చెప్పారు. హజ్రత్ యాఖూబ్ (అ) ఆ కలను గూర్చి విని, "నాయనా! నీ కలను గురించి నీ సోదరులకు తెలుపకు. వాళ్ళు నిన్ను బాధిస్తారేమో! నీ సంరక్షకుడయిన అల్లాహ్ నిన్ను తన సందేశ కార్యానికై ఎన్నుకున్నాడేమో! ఆయన నిన్ను తన ప్రవక్తగా నియమిస్తాడు. గొప్ప జ్ఞానమునిస్తాడు. నీ తాత ఇస్హాఖ్ (అ), ముత్తాత హజ్రత్ ఇబ్రాహీమ్ (అ)లను ప్రవక్తలను చేసినట్లే అల్లాహ్ నీపై కూడ కటాక్షిస్తాడు" అని హెచ్చరించారు.

హజ్రత్ యూసుఫ్ (అ) చిన్నప్పటి నుంచి బుద్ధిమంతుడు, తెలివి గలవాడు. అందుకే హజ్రత్ యాఖూబ్ (అ), యూసుఫ్ (అ)ను తన కుమారులందరికన్నా ఎక్కువగా ప్రేమించేవారు. ఆ "కల" సారాంశాన్నిబట్టి తన తరువాత ప్రవక్త పదవిని దైవం, యూసుఫ్ (అ) చేత నిర్వహింపజేస్తాడని ఆయనకు తెలిసిపోయింది. అందువల్ల ఇంకా ఎక్కువగా హజ్రత్ యూసుఫ్(అ)ను ప్రేమించసాగారు. హజ్రత్ యూసుఫ్(అ) సవతి సోదరులందరికీ ఇది గిట్టేది కాదు. వీరు ఆ తండ్రీకొడుకులను చూసి అసూయపడేవారు.

ఆ రోజులలో అరబ్బు దేశంలో ఎవరి కొడుకులు, మనుమలు, సోదరులు, సోదరుని కుమారులు బలవంతులో వారి వంశస్థులే గొప్పవారుగా భావించబడేవారు. సమాజంలో వారి ప్రభావం హెచ్చుగా ఉండేది. వారి జోలికి ఎవ్వరూ వచ్చేవారు కాదు. అందుచేత బలవంతులయిన కుమారులనే ప్రజలు ఎక్కువగా అభిమానించేవారు. యూసుఫ్(అ)గారి సోదరులు కూడ ఆ దృష్టితోనే, "మేము యూసుఫ్(అ)కన్నా బలవంతులము, సమయం వచ్చినప్పుడు మేము మాత్రమే పనికొస్తాము. బలహీనుడు, ఒంటరివాడయిన యూసుఫ్(అ) వల్ల ఏమవుతుంది? కాబట్టి మన తండ్రి మనలనే ఎక్కువగా ప్రేమించాలి. మాకు బదులు యూసుఫ్(అ)ను ప్రేమించటం మాకు గొప్ప అవమానం" అని అనుకున్నారు.

ఒకనాడు సోదరులందరూ చేరి కూడబలుక్కున్నారు. "నాన్నగారు భ్రమలో పడినట్లు తెలుస్తోంది. ఒక 'ముఠా'గానున్న మనలను ఆయన చేరదీసే బదులు, యూసుఫ్(అ)ను అభిమానించడం అన్యాయం. కాబట్టి యూసుఫ్(అ)ను ఎక్కడికయినా తీసుకెళ్ళి చంపివేద్దాము, లేదా ఎక్కడయినా విడిచిపెడదాము, రండి, యూసుఫ్(అ) ఉన్నంతకాలం నాన్నగారు మనల్ని చేరదియ్యరు."

వీరిలో ఒకడిలా అన్నాడు, "వద్దు, యూసుఫ్(అ)ను చంపవద్దు. అడవిలోకి తీసుకెళ్ళి ఏదయినా చీకటి బావిలో పడవేద్దాం. దారినపోయే బాటసారులు అతణ్ణి పైకి తీసి వాళ్ళ వెంట తీసుకుపోతారు."

ఈ సలహా అందరికీ నచ్చింది. వారంతా వెళ్ళి తండ్రితో ఇలా అన్నారు:

"నాన్నగారూ! యూసుఫ్(అ)ను మా వెంట పంపరేమిటి? మా మీద మీకు నమ్మకం లేదా? మేము కూడ అతని శ్రేయోభిలాషులమే కదా! రేపు మా వెంట పంపండి, అడవిలో షికారుకు తీసుకెళతాము. ఆటపాటలతో మనసుకు ఊరట కలుగుతుంది. అతని రక్షణకై మేమున్నాం గదా."

"మీతో పంపాలంటే నాకు చాలా భయంగా ఉంది. మీ అశ్రద్ధ వలన ఎక్కడ తోడేలు తినేస్తుందో!" అన్నారు తండ్రి.

"మేమంతా ఒక ముఠాగా ఉన్నాం. మేము ఇంత మందిమి ఉండగా యూసుఫ్(అ)ని తోడేలు తినివేస్తే ఇక మేమెందుకు? ఇక మేము దేనికి పనికొస్తాము?"

ఈ విధంగా మాయమాటలు చెప్పి తండ్రిని ఒప్పించారు. ఒకనాడు యూసుఫ్(అ)ను వెంటబెట్టుకుని అడవి వైపుగా ప్రయాణమయ్యారు. ముందు వేసుకున్న పథకం ప్రకారం అడవిలో ప్రవేశించాక యూసుఫ్ (అ)ను ఒక లోతయిన బావిలో పడవేశారు. అప్పుడు దైవవశాత్తు హజ్రత్ యూసుఫ్(అ)కు రక్షణ కలిగింది. ఎప్పటికైనా తన సోదరులకు, వారి అఘాయిత్యాన్ని గుర్తుచేయకపోతానా? వారు తమ దుశ్చేష్టకు పశ్చాత్తాపం చెందకపోతారా? అనే భావం ఆయన మనసులో కలిగింది.

అల్లాహ్ తరఫున ఎలాంటి రక్షణ లభిస్తుందో, ఏ ఏర్పాట్లు జరుగుతున్నాయో ఈ సోదరులకు ఏం తెలుసు? తాము పన్నుతున్న కుట్రలు, కుతంత్రాలకు పర్యవసానం ఏమిటో వారికేం తెలుసు?

బావిలో పడవేసేముందు యూసుఫ్ (అ) చొక్కాను తీసి, దానికి ఏదో ఒక జంతు రక్తాన్ని పులిమి రాత్రికి ఇల్లు చేరారు- తండ్రి వద్దకు ఏడుస్తూ, గుండెలు బాదుకుంటూ.

"నాన్నగారూ! మేమంతా పరుగులాటలో పాల్గొని యూసుఫ్(అ)ను సామానుల వద్ద కాపలాగా ఉంచాము. ఇంతలో ఒక తోడేలు వచ్చి యూసుఫ్(అ)ని తినివేసింది. ఇదిగో అతని రక్తసిక్తమయిన చొక్కా" అని చూపించారు.

హజ్రత్ యాఖూబ్ (అ)కు వాళ్ళ మాటల్లో నమ్మకం కుదరలేదు.

"మీరు యూసుఫ్(అ)ని మోసం చేశారు. మీరు చెప్పేదంతా సరి అయిందని నా మనస్సుకు తోచడం లేదు. ఇక ఓర్పు వహించడమే నాకు మంచిది. మీరు చెప్పేదానికి బదులుగా అల్లాహ్ నుండి సహాయం కోరుతున్నాను" అన్నారు హజ్రత్ యాఖూబ్ (అ).

మరో పరీక్ష ఎదురయింది

దైవలీల చూడండి! యూసుఫ్(అ)ను వారి సోదరులు బావిలో త్రోసివేశాక ఒక బిడారు (ప్రయాణీకుల సమూహం) అటు వైపుగా వచ్చింది. వాళ్ళు తమ మనిషిని మంచినీటి కోసం బావికి పంపించారు. అతడు బావిలోనికి చేద వేసి లోనికి తొంగి చూస్తే బాలుడు కన్పించాడు. అతను అక్కణ్ణించే, "శుభం! బావిలో బాలుడున్నా" డని సంతోషంతో కేకలు పెట్టాడు. బిడారులోనివారు హజ్రత్ యూసుఫ్ (అ)ని బావిలోంచి పైకి తీసి ఎక్కడయినా అమ్మివేసే ఉద్దేశ్యంతో తమ దగ్గరే ఉంచుకున్నారు. జరిగేదంతా దైవాజ్ఞ వల్లనేనని, ఆయనకు ప్రతి విషయం తెలుసని వారికయినా ఏం తెలుసు?

బిడారులు మదీనా నుండి ఈజిప్టుకు పోతున్నారు. వాళ్ళు యూసుఫ్(అ)ను తక్కువ వెలకే అమ్మివేశారు. వారికి హజ్రత్ యూసుఫ్ (అ)ను అమ్మి ఎక్కువ లాభం ఆర్జించాలన్న ఆశ కూడా లేదు.

ఈజిప్ట్ పాదుషాకు పుతేపార్ అనువాడు ముఖ్యమంత్రి. అతడు ప్రభుత్వ ఖజానాకు అధిపతి. అతడినే అజీజ్ అని కూడా అంటారు. అతడే బిడారువారి వద్ద నుండి యూసుఫ్ (అ) ను కొన్నాడు. హజ్రత్ యూసుఫ్ (అ) పట్ల అమిత వాత్సల్యం కలిగింది అజీజ్‌కు. ఈ కుర్రవాడు ఉత్తమ వంశానికి చెందినవానిలా ఉన్నాడు. వీళ్ళకెలాగో దొరికియుంటాడని అర్థం చేసుకున్నాడు. తర్వాత యూసుఫ్ (అ) మాటల్నిబట్టి, ప్రవర్తననుబట్టి అతడు బుద్ధిమంతుడు. తెలివిగలవాడని గ్రహించాడు. అజీజ్‌కు మగపిల్లలు లేరు. అతడు తన భార్యతో, "ఈ కుర్రవానిని జాగ్రత్తగా చూసుకో, ఇతని అవసరం మనకు కలగవచ్చు లేదా మనమే పెంచుకుందాం" అన్నాడు.

అప్పుడు హజ్రత్ యూసుఫ్(అ) వయస్సు 18 సంవత్సరాలు. కొద్ది రోజులలోనే ఇంటి బాధ్యతలన్నీ యూసుఫ్(అ)కు అప్పగించాడు అజీజ్. తన ఆస్తి వ్యవహారాలు, వాటి సంరక్షణ బాధ్యతలన్నీ యూసుఫ్(అ)కు అప్పజెప్పాడు.

ఇప్పటివరకూ హజ్రత్ యూసుఫ్ (అ) పల్లెటూరి జీవితం గడిపారు. పల్లె ప్రజలలో ఉండే మంచి గుణాలన్నీ ఆయనలో ఉన్నాయి. అదీగాక

ఆయన ప్రవక్తల వంశంలో జన్మించారాయె. దైవభక్తి, సచ్ఛీలత ఆయన హృదయంలో కూరి కూరి నింపబడ్డాయి. పల్లెసీమల పరిశుద్ధ వాతావరణంలో పెరగటం వల్ల మంచి ఆరోగ్యంగా ఉన్నారు. ఇకపోతే అల్లాహ్ ఆయన్ని మంచి ప్రభుత్వంకల నాగరిక దేశంలో, నాగరికమయిన ఉన్నత వంశంలో చేర్చాడు. అంతేకాదు, ఆయన అధికారం చెలాయించే, బాధ్యతల్ని సక్రమంగా నిర్వహించే, ప్రజావసరాలకు కావలసిన ఏర్పాట్లు చేసే సామర్థ్యాన్ని సులభంగా నేర్చుకోవడానికి తగిన కుటుంబం లభ్యమయింది. ఇవన్నీ చూస్తుంటే భవిష్యత్తులో హజ్రత్ యూసుఫ్ (అ) ద్వారా దైవం తీసుకునే పని కొరకే ఆయనకు శిక్షణ లభిస్తోందా! అని అనిపిస్తుంది.

దైవానుగ్రహం చూడండి ! ఈ విధంగా హజ్రత్ యూసుఫ్ (అ)కు, ఓవైపు నివసించేందుకు మంచి పరిసరాలు, మరొక వైపు రాచ సంతానానికి లభించగల ఉన్నత శిక్షణకై ఏర్పాట్లు జరిగిపోయాయి.

అల్లాహ్ తన పనులు నెరవేర్చుకునేందుకు ఎన్నో రీతులుగా ఆ పనులు చేయిస్తాడన్నది సత్యం, కాని వాటి అంతరార్థమేమిటో అందరికీ తెలియదు.

హజ్రత్ యూసుఫ్ (అ), అజీజ్ ఇంట్లో పెరిగి చక్కని నవ యువకుడయ్యాడు. అజీజ్ భార్య పేరు జులైఖా. స్వతహాగా ఆమె మంచి స్త్రీ కాదు. ఆమె యూసుఫ్ (అ)ని చూచి మోహించింది. ఒకనాడు అజీజ్ ఇంట్లో లేని సమయం చూసి ఆమె చెడు ఉద్దేశ్యంతో యూసుఫ్(అ)ను ఒక గదిలో బంధించి, తన వద్దకు రమ్మన్నది. హజ్రత్ యూసుఫ్(అ), "దేవుడు రక్షించుగాక! నా సంరక్షకుడు (దైవం) నాకు గౌరవాన్ని, ఉన్నత స్థానాన్ని ఇచ్చి ఉండగా నేనటువంటి తుచ్ఛమయిన పని చేస్తానా? ఇటువంటి పని నా వల్ల ఎన్నటికీ జరుగదు. నా సంరక్షకుడు, పాపష్టులకు జయం కలుగజేయడు" అని బదులు చెప్పారు. ఇది విని కూడా ఆ స్త్రీ యూసుఫ్(అ)కు దగ్గరగా వచ్చింది. హజ్రత్ యూసుఫ్(అ) ఆ స్త్రీ దురుద్దేశాన్ని గ్రహించి పై మాటలనక పోతే, ఆయనే ఆ స్త్రీ వలలో చిక్కుకునేవారు. కాని అల్లాహ్ ఆయన్ని నీతిబాహ్యమయిన పని నుండి, చెడు చేష్టల నుండి రక్షించాడు. యూసుఫ్ (అ) ఆ కఠిన పరీక్షలో నెగ్గారు- అల్లాహ్ తన ప్రవక్తగా ఎన్నుకుని పంపిన భక్తులలో యూసుఫ్ (అ) ఒకరు గనక!

ఆ స్త్రీ తన దగ్గరగా రావడం చూసి యూసుఫ్ (అ) గుమ్మం వైపు పరుగెత్తారు. కాని ఆమె సిగ్గువిడిచి అతని వెనుక పరుగెత్తి ఆయన చొక్కా పట్టుకుంది. హజ్రత్ యూసుఫ్(అ) గట్టిగా విదిలించేసరికి ఆ చొక్కా చిరిగి దాని ముక్క మాత్రం జులైఖా చేతిలో ఉండిపోయింది. యూసుఫ్(అ) తలుపు తెరచుకుని బయటపడ్డారు. అయినా జులైఖా వెంటపడింది.

ఇద్దరూ పరుగెత్తుకు రావడం అప్పుడే ఇంటికి వస్తున్న అజీజ్ కంటబడింది. జులైఖా కొంచెం తటపటాయించి, కంగారుగా, "నీ భార్యను చెడు తలంపుతో చూచినవాడికేం శిక్ష?" అని, కొంచెం ఆగి మళ్ళీ, "వాడిని బందీఖానాలో వేయండి లేదా వాడికి సదా గుర్తుండే విధంగా కఠిన శిక్ష విధించండి" అన్నది.

"లేదు. ఈమెయే నన్ను బ్రతిమాలింది. కాని నేనందుకు ఒప్పుకోలేదు" అన్నారు హజ్రత్ యూసుఫ్(అ).

వ్యామోహం-జులుం

ఇంతలో జులైఖా వంశస్థుడే అయిన ఓ వ్యక్తి అటు వచ్చాడు. అతడు, మొదటి నుండి జులైఖా గుణం తెలిసిన వాడు కాబట్టి సంగతి గ్రహించి, తెలివైన సలహా ఇచ్చాడు.

"చూడండి! చొక్కా వెనుక వైపు చిరిగితే జులైఖా అబద్ధమాడినట్లు. ఈతడు నిజం పలికినట్లు. చొక్కా ముందు భాగం చిరిగివుంటే, అతడే స్త్రీ వైపు పరుగెత్తినట్లు, ఆ పెనుగులాటలో చొక్కా ముందు భాగము చిరిగినట్లు అర్థము. ఒకవేళ వెనుక వైపు చిరిగి ఉంటే, యూసుఫ్(అ) పారిపోతుండగా, ఆ స్త్రీ అతనిని పట్టుకునే ప్రయత్నంలోనున్నట్లు అర్థం. మరో విషయం ఏమంటే, యూసుఫ్(అ) బలవంతం చేసి ఉంటే జులైఖా బట్టలు చిరిగియుండాలి. ఇంకా శరీరం మీద గాట్లు, రక్కిన గుర్తులు కూడా ఉండాలి. వీటన్నింటినీ పరిశీలించి తప్పెవరిదో అర్థం చేసుకోవచ్చు."

ఈ వివరణను విన్న అజీజ్ విషయాన్ని అవగతం చేసుకున్నాడు. తన భార్యను గదమాయించాడు. "ఈ అగడమంతా నీదే. నిజంగా మీ ఆడవాళ్ళు

పన్నే కుయుక్తులు విడ్డూరంగా ఉంటాయి" అన్నాడు. ఇటు యూసుఫ్(అ) వంక చూసి, 'సరే పోనీ' అని నచ్చజెప్పాడు. జులైఖాని, "పో, యూసుఫ్(అ)ను క్షమాపణ కోరుకో. తప్పంతా నీదే" అన్నాడు.

జులైఖా హజ్రత్ యూసుఫ్(అ)తో ప్రవర్తించిన వైనం ఊరంతా పాకింది. ఆడవాళ్ళు అది విని, "అజీజ్ భార్య తన బానిస మీద ప్రేమలో గ్రుడ్డిదౌతూంది. జులైఖా మూర్ఖత్వంలో చిక్కుకున్న విషయం మాకూ తెలుసు" అన్నారు.

జులైఖాకు ఈ మాటలు రోషాన్ని కలిగించాయి. ఒకనాడు జులైఖా ఆ స్త్రీలందరినీ విందుకు పిలిపించింది. మెత్తలు వేసిన కుర్చీలు వేసింది. ప్రతి స్త్రీ ఎదురుగా ఖరీదయిన పండ్లు, వాటిని కోయడానికి ఒక్కొక్క చాకు చొప్పున అందరిముందూ ఉంచింది. వాళ్ళు పళ్ళు కోస్తుండగా, జులైఖా యూసుఫ్(అ)ని పిలిచింది. యూసుఫ్(అ)ని చూచిన ఆ స్త్రీలందరికీ ఒక్కసారి మతి చలించింది. పండ్లు కోయటానికి బదులు తమ చేతి వ్రేళ్ళు కోసుకున్నారు. "అల్లాహ్! అల్లాహ్! ఇతడు మానవుడు కాదు, దైవదూత" అన్నారు ముక్తకంఠంతో.

ఆ ఫళంగా అజీజ్ భార్య, "చూశారు గదా! ఇతని విషయంలోనే మీరంతా నన్ను అవహేళన చేశారు. నేనితన్ని బ్రతిమాలాను. కాని తప్పించుకున్నాడు. ఇప్పుడయినా ఒప్పుకోకపోయినట్లయితే అతడు జైలులోనే కుమిలి, చాలా అవమానంపాలు కావల్సివస్తుంది"అన్నది.

చూశారు కదా! అప్పటి స్త్రీలు ఎటువంటి సిగ్గుమాలినవారో! ఇప్పటి పాశ్చాత్యులకు, తామే స్త్రీలకు సమాజంలో ఉన్నత స్థానాన్ని కల్పించి, మగవారితో సమానంగా స్వాతంత్ర్యాన్నిచ్చామని గర్వం. అసలు విషయమేమంటే, షైతాన్ చేష్టలు, కుయుక్తులు ప్రతి కాలంలోనూ ఒకే రకంగా ఉన్నాయి.

హజ్రత్ యూసుఫ్ (అ), జులైఖా సిగ్గుమాలిన మాటలు విని, "ఓ నా సంరక్షకుడా! నాకు బందిఖానాయే ప్రియమయినది. కాని ఈ స్త్రీ నన్ను తన జాలంలో వేసుకోవడం నాకేమాత్రం ఇష్టం లేదు. ఓ నా యజమానీ! నీవు నన్ను ఈ కుతంత్రాల నుండి రక్షించకపోతే నేనిందులో చిక్కుకుని దుర్మార్గులలో చేరిపోతానేమోనన్న భయం వేస్తుంది" అని ప్రార్థించారు.

హజ్రత్ యూసుఫ్ (అ) ఎంతటి గొప్పవారు! పరిపూర్ణ యౌవ్వనం ఉంది. దానికి తోడు ఉన్నత వంశీయులయిన పుర స్త్రీలు, మాయోపాయములతో కవ్వించి తనను పాపపంకిలంలోకీడ్వ ప్రయత్నిస్తున్నారు. అయినా యూసుఫ్(అ) ఎంతో నిగ్రహం పాటిస్తున్నారు. అవును, ఆయన రుజువర్తనం వైపునకే తిరిగి ఉన్నారు. ఇటువంటి తుచ్ఛుల మధ్య ఉంటూ కూడ సచ్ఛీలుడై అల్లాహ్‌కు భయపడి చెడుకు దూరంగా ఉన్నారు. సచ్ఛీలురు కాగోరేవారికి, సన్మార్గాన్ని అనుసరించే నిర్ణయం గైకొన్నవారికి దైవ సహాయం తప్పక లభిస్తుంది. హజ్రత్ యూసుఫ్(అ) మొరను అలకించి దైవం ఆయన్ని, ఆ చెడు స్త్రీల బారి నుండి కాపాడాడు. వాస్తవంగా ఆయన సమస్తమూ వినగలడు, సర్వమూ ఆయనకే తెలుసు.

అవమానభారంతోనూ, కక్ష సాధించే ఉద్దేశ్యంతోనూ ఆ స్త్రీలు యూసుఫ్(అ)కు జైలు శిక్ష వేయించారు. అయితే పట్టణంలోని తక్కిన ఉన్నత స్త్రీలకు ఆయన నిర్దోషి అన్న విషయం తెలుసు. వారి ద్వారా క్రమేణా హజ్రత్ యూసుఫ్ (అ) సత్ప్రవర్తన గురించి ప్రచారం జరిగింది. ఆయన మంచితనం, వివేకం, నిజాయితీ తేటతెల్లమవసాగింది. ఈ ప్రచారం భవిష్యత్తులో హజ్రత్ యూసుఫ్ (అ) చేయవలసివున్న పనికి, ఆయన ఈజిప్ట్‌వాసులకు ఇవ్వవలసిన దైవ సందేశానికి అవసరమయింది కూడా.

జైలులో హజ్రత్ యూసుఫ్(అ)తోబాటు మరో యిద్దరు కూడా వేయబడ్డారు. వాళ్ళలో ఒకడు, పాదుషాకు మద్యం పోసేవాడు. రెండవవాడు, వంటశాలకు అధిపతి. ఏదో తప్పు చేసినందుకు పాదుషా వాళ్ళిద్దరినీ జైలుకు పంపాడు.

ఒకనాడు వారిలో ఒకడు హజ్రత్ యూసుఫ్ (అ)తో ఇలా అన్నాడు, "నాకొక కల వచ్చింది. కలలో నేను మద్యం తయారుచేస్తున్నాను" అన్నాడు. రెండవవాడు, "నేను కూడా కలగన్నాను. ఆ కలలో, నా తల మీద రొట్టెలున్నాయి. పిచ్చుకలు రొట్టెల్ని పొడిచి పొడిచి తింటున్నాయి" అన్నాడు.

"మీరు పుణ్యపురుషుల్లా ఉన్నారు. మా కలల ఆంతర్యం ఏమిటో తెలుపండి" అన్నారు ఇద్దరూ.

నిజం నిలకడ మీద తేలు

హజ్రత్ యూసుఫ్(అ), "మీకు ఆహారం సరఫరా అయ్యే ముందు మీ కలల అర్థం చెబుతాను. ఈ జ్ఞానాన్ని నా ప్రభువు నాకిచ్చాడు. అసలు విషయమేమంటే, అల్లాహ్ మీద విశ్వాసంలేక పరలోక జీవితాన్ని త్రోసిపుచ్చేవారి పద్ధతుల్ని నేను విడిచి పెట్టాను. నేను, నా పూర్వీకులు, పెద్దలూ అయిన హజ్రత్ ఇబ్రాహీమ్ (అ), హజ్రత్ ఇస్హాఖ్ (అ), హజ్రత్ యాఖూబ్ (అ) గార్ల ధర్మాన్ని స్వీకరించాను. అల్లాహ్కు సహవర్తులుగా మరొకర్ని నిలబెట్టటం మన పని కాదు. మన అందరిపైనా అల్లాహ్ అనుగ్రహించి మనకు ధర్మమార్గం చూపాడు. మనల్ని తన దాసులుగా చేసి, తనకు తప్ప ఇతరులకు దాస్యం చేసే బాధ నుండి తప్పించాడు. ఒక్క అల్లాహ్ దాస్యాన్ని తిరస్కరించేవారు ప్రతి ఒక్కరినీ మొక్కవలసి ఉంటుంది. అందరిముందూ సాష్టాంగపడవలసిన దుస్థితి ఏర్పడుతుంది. కాని చాలా మంది ఈ సత్యాన్ని తెలుసుకోరు. సరయిన విషయాన్ని అంగీకరించరు. తాము అల్లాహ్కు దాసులమన్న యదార్థాన్ని విస్మరించడంచేతనే ఇతరుల దాస్యానికి తలవొగ్గుతారు.

"ఓ (జైలులోని) స్నేహితులారా ! ఆలోచించండి. అనేక చిల్లర దేవతల ముందు మోకరిల్లడం, చేతులు జోడించి అర్థించడం మంచిదా? లేక సర్వశక్తిమంతుడు, మహామహిమాన్వితుడు అయిన ఒకే దేవుని దాస్యం మంచిదా ? ఆయన్ని వదలి మరెవరి దాస్యం చేస్తున్నా, మీరు, మీ పెద్దలు ఏదో కాల్పనికమయిన పేర్లు పెట్టుకుని వారినే దేవీదేవతలుగా భావించి వారిని పూజిస్తున్నారనియే కదా అర్థం. మీరు చెబుతున్నదానికీ, చేస్తున్నదానికీ అల్లాహ్ నుండి ఏ విధమైన సాక్ష్యాధారం మీ వద్ద లేనేలేదు కదా! గుర్తుంచుకోండి! ప్రభుత్వం దైవానిది. ఆజ్ఞాపించే అధికారం ఆయనకే ఉంది, ఆయనకు తప్ప ఇతరులకు దాస్యం చేయరాదని ఆయనే ఆజ్ఞాపించియున్నాడు. సన్మార్గ జీవితం ఇదే. కాని చాలా మందికి ఈ విషయం తెలియదు."

చూశారా! హజ్రత్ యూసుఫ్ (అ) జైలులోనున్న తన తోటివారితో ఏ విధంగా సంభాషించారో? కల సారాంశాన్ని తెలిపేముందు, మాటలో మాటగా

దేవుని ఏకత్వం. పరలోక జీవితాల మహత్తర సందేశాన్నిచ్చారు. ఈ ఆదర్శంలో మనందరికీ గొప్ప ఉపదేశమున్నది.

"ఓ, నా (జైలులోని) స్నేహితులారా! వినండి, మీ కలకు అర్థం. మీలో ఒకరికి మీ దేశపు (ఈజిప్ట్) పాదుషాకు మద్యం త్రాగించే ఉద్యోగం దొరుకుతుంది. రెండవవాడు, ఉరికంబం ఎక్కుతాడు. వాడి తలని పక్షులు (కాకులు) రక్కి తింటాయి. మీరు అడిగిన కలల సారాంశమిదే."

తర్వాత హజ్రత్ యూసుఫ్ (అ) పాదుషాకు మద్యం త్రాగించే ఉద్యోగం లభించనున్న వ్యక్తితో, "నీవు పాదుషా వద్దకు వెళ్ళినప్పుడు నా సంగతి కూడా అక్కడ తెలియజెయ్యి" అని చెప్పారు. కాని బయటకు వెళ్ళి రాజు సాన్నిధ్యం పొంది, అతడు ఆ విషయాన్ని మరచిపోవడంచేత హజ్రత్ యూసుఫ్(అ) కొన్ని సంవత్సరాలపాటు జైలులోనే ఉండవలసివచ్చింది.

ఒక రోజు దర్బారులో పాదుషా తన మంత్రులను ప్రశ్నిస్తున్నాడు.

"రాత్రి నాకొక కల వచ్చింది. ఏడు ఆవులు బలిసి ఉన్నాయి. వాటిని ఏడు బక్కచిక్కిన ఆవులు తింటున్నాయి. అంతేకాదు, ఏడు ధాన్యపు కంకులు పచ్చగా ఉన్నాయి. మరో ఏడు కంకులు ఎండిపోయి ఉన్నాయి. మీరు కలలకు అర్థం చెప్పగలవారయితే నా కలకు అర్థం చెప్పండి."

"ఇదేదో మామూలు కల మాత్రమే. ఇటువంటి కలల అర్థమయితే మాకు తెలియదు" అని వారు జవాబిచ్చారు.

ఖైదీలలో శిక్ష నుండి తప్పించబడినవాడికి ఇంతకాలం తర్వాత హజ్రత్ యూసుఫ్(అ)ను గురించి గుర్తువచ్చింది. పాదుషాతో మాట్లాడి, అతడిని పొగిడి ఇలా అన్నాడు. "నన్ను యూసుఫ్ (అ) వద్దకు పంపండి. ఇప్పుడే మీ కల అర్థం చెబుతాను." పాదుషా అతన్ని యూసుఫ్ (అ) వద్దకు పంపాడు. అతను యూసుఫ్ (అ)తో, "ఓ యూసుఫ్! నేను చెప్పే కలకు అర్థం చెప్పు. ఏడు బలిసిన ఆవుల్ని, ఏడు బక్కచిక్కిన ఆవులు తింటున్నాయి. ఏడు ధాన్యపు కంకులు పచ్చగా ఉన్నాయి, మరో ఏడు కంకులు ఎండిపోయాయి. నేనిప్పుడే వెళ్ళి ఆ

అర్థం వారికి తెలియజేస్తాను. దాన్నిబట్టి నీ గురించి వాళ్ళు తెలుసుకుంటారని నా విశ్వాసం" అని అన్నాడు.

హజ్రత్ యూసుఫ్(అ) కల అర్థాన్ని వివరించసాగారు. "మీరు ఏడు సంవత్సరాల వరకు వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తారు. పంటలు పుష్కలంగా పండుతాయి. ఆ ఏడేళ్ళు తగినంత మాత్రమే తిని, మిగులు ధాన్యాలను భద్రపరచండి. ఎందుకంటే ఆ తర్వాత వచ్చే ఏడు సంవత్సరాలు కరువు రోజులు. పంటలు బహు కొద్దిగా మాత్రమే పండుతాయి. మీరు నిల్వ చేసుకున్న పంటే పనికివస్తుంది. ఎనిమిదో సంవత్సరం తిరిగి మంచి వర్షాలు కురిసి భూములు సస్యశ్యామలమై పంటలు సమృద్ధిగా పండుతాయి."

పాదుషా కొన్ని రోజుల తర్వాత తన కలలకు అర్థం తెలుసుకుని యూసుఫ్ (అ)ను తన వద్దకు పిలిపించాడు. పాదుషా నౌకర్లు హజ్రత్ యూసుఫ్ (అ)ను విడిపించటానికి ఖైదుకు వెళ్ళగా ఆయన, "అసలు నన్నెందుకు ఖైదులో వేశారో ముందు తేల్చుకోమని చెప్పండి. ఈ విషయంలో వ్రేళ్ళు కోసుకున్న ఆ స్త్రీలను విచారించండి. నా ప్రభువు వారి కుతంత్రాలను గురించి బాగా ఎరుగు. అయితే అసలు విషయమేమిటో మీరు కూడా తెలుసుకోవాలి కదా!"

హజ్రత్ యూసుఫ్(అ)గారి సందేశాన్ని పురస్కరించుకుని పాదుషా విషయాన్నంతటినీ పరిశీలించాడు. ఆ స్త్రీలతో, "మీరు యూసుఫ్ (అ)ను బ్రతిమాలినప్పుడు ఆయన ఎలా ప్రవర్తించాడు?" అని అడగ్గా, వారంతా ముక్తకంఠంతో, "అల్లాహ్, అల్లాహ్, మేము యూసుఫ్ (అ)లో అణు మాత్రం చెడును కూడా చూడలేదు" అన్నారు.

అజీజ్ భార్య జులైఖాను కూడా విచారించగా ఆమె కూడా, "నిజమిప్పుడు తెలిసింది- నేను చేసింది తప్పని. నేనే యూసుఫ్(అ)ను లోబర్చుకోవటానికి మాయలు పన్నాను. నిజానికి అతడు, సత్యవంతుడు, నిర్దోషి" అని ఒప్పుకోక తప్పలేదు.

ఈజిప్ట్ అధికారిగా...

ఇది విని హజ్రత్ యూసుఫ్ (అ), "ఈ విధంగా విచారణ జరపడంలో నా ఉద్దేశ్యమేమంటే, నేను అజీజ్‌కు తన వ్యవహారంలో రహస్యంగా కూడా ఏ విధమైన దగా చేయలేదని అతను తెలుసుకోవాలి. దగాకోరుల ఎత్తుల్ని అల్లాహ్ విజయవంతం చేయడు. నా జీవితం సకల విధాలయిన చెడుల నుండి పూర్తిగా పరిశుద్ధమయిందని నేను అనటం లేదు. మనస్సు మానవుణ్ణి చెడు త్రోవలు పట్టిస్తుంది. అయితే నా ప్రభువు కరుణించేవాడు, చెడు నుండి తప్పకుండా రక్షిస్తాడు. నా ప్రభువు క్షమించేవాడు, అమిత దయామయుడు"అని అన్నారు.

ఈ మాటలు విన్న పాదుషా, "సరే, యూసుఫ్(అ)ను నా వద్దకు తీసుకు రండి. నా స్వంత పనులకై అతన్ని ఎన్నుకుని నా స్వంతవాణ్ణిగా చేసుకో దలిచాను" అన్నాడు. యూసుఫ్(అ)తో సంప్రదించిన తరువాత, "మీరు మాకు గౌరవనీయులు, మిమ్మల్ని పూర్తిగా విశ్వసిస్తున్నాను. మీరు మా దేశపాలనలో ఆహార శాఖపై అజమాయిషీ చేయవలసిందిగా కోరుతున్నాన"ని చెప్పాడు.

"నాకు దేశంలోని ఖజానాలు, ధాన్యాగారాలన్నీ అప్పగించండి. నేనేది కావాలనుకుంటే అది చేస్తాను. అంటే ఆహార శాఖ నిర్వహణలో విస్తృతాధికారాలు ఇవ్వండి. దేశాన్ని, దేశ ప్రజలనీ కరువు నుండి రక్షిస్తాను. ఈ పని ఎలా నిర్వహించాలో నాకు తెలుసు" అన్నారు హజ్రత్ యూసుఫ్ (అ).

పాదుషా అందుకు ఒప్పుకున్నాడు. ఈ విధంగా అల్లాహ్ హజ్రత్ యూసుఫ్ (అ)కు ఈజిప్ట్‌ను పరిపాలించే అవకాశం కల్పించాడు. ఇదీ అల్లాహ్ అనుగ్రహమంటే! ఆయన తాను కోరినవారికి, వారు అడిగినదంతా ఇస్తాడు. అల్లాహ్ వద్ద సత్పురుషులకు తగిన ప్రతిఫలం తప్పక లభిస్తుంది. ఇకపోతే, పరలోకం పట్ల విశ్వాసంగలవారికి తగిన ప్రతిఫలం- అది అల్లాహ్‌ను విశ్వసించినవారికి, ఆయన ఇష్టపడనివాటికి దూరంగా ఉంటూ, ఆయన ఆజ్ఞలను పాలించేవారికి ఎంతో మంచి ప్రతిఫలం.

హజ్రత్ యూసుఫ్ (అ)కు ఈజిప్ట్ రాజ్యానికవసరమయిన ఏర్పాట్లు చేసే అధికారం హస్తగతమయింది. ఏడేళ్ళ వరకు ఆయన వ్యవసాయం

విస్తృతం చేయించి ధాన్యాన్ని నిల్వ చేశారు. ఆ తరువాత ఏడేళ్ళు పొలాలు వర్షాలులేక బీడువారిపోయి పంటలు పండలేదు. లోగడ నిల్వచేసి ఉంచిన ధాన్యం ప్రజావసరాలు తీర్చడానికి పనికివచ్చాయి. లక్షలాది ప్రజలు ఆకలి చావుల నుండి రక్షించబడ్డారు. దూరదూరాల నుండి ప్రజలు వచ్చి ధాన్యాన్ని ఈజిప్ట్‌లో కొని తీసుకువెళ్ళేవారు. ఒకనాడు ధాన్యం కొరకు అన్వేషిస్తూ హజ్రత్ యూసుఫ్ (అ) సోదరులు ఈజిప్ట్‌కు వచ్చారు. వాళ్ళని చూడగానే హజ్రత్ యూసుఫ్(అ) తన అన్నదమ్ముల్ని గుర్తుపట్టారు. కాని అన్నదమ్ములకు మాత్రం ఈజిప్ట్‌కంతటికి మకుటంలేని మారాజుగా వర్థిల్లుతున్న యూసుఫ్(అ) తమ సోదరుడే అన్న విషయం తెలియదు. హజ్రత్ యూసుఫ్ (అ) తోబుట్టువయిన బిన్ యామిన్‌ను మాత్రం వారి తండ్రి (యాఖూబ్) ఇంటి దగ్గరే ఉంచుకున్నారు. వీళ్ళతో పంపలేదు. ప్రభుత్వం నుండి, ఒక్కొక్కరికి ఒక మనిషికి సరిపడు ధాన్యము "రేషన్"గా నిర్ణయించబడింది. అంతేగాని ప్రతి ఒక్కరికి కావలసినంత దొరికేది కాదు. అందుచేత ఈ పది మంది సోదరులకు వారికి సరిపడే రేషన్ ధాన్యమే దొరికింది. పదకొండవ సోదరునికీ, తమ తండ్రికీ కావలసిన ధాన్యం అడగ్గా హజ్రత్ యూసుఫ్ (అ) ఇలా అన్నారు:

మరోసారి ఇస్తాను. అయితే మీరు మరోసారి వచ్చేటప్పుడు మీ పదకొండవ సోదరుణ్ణి కూడా పిలుచుకు రండి. తండ్రి వృద్ధాప్యం వలన రాలేడు. కాని సోదరుడు మాత్రం రాగలడు కదా!

హజ్రత్ యూసుఫ్(అ) మనస్సు తన సోదరుని చూడ్డానికి తహతహలాడసాగింది. అందుకే ఆయన సోదరులు ధాన్యం కొరకు చెల్లించిన ధనాన్ని తిరిగి వారి మూటలలో రహస్యంగా పెట్టుటకై నౌకర్లను ఆజ్ఞాపించారు.

హజ్రత్ యూసుఫ్(అ)గారి సోదరులు ఇల్లు చేరి, "ఈసారి 'బిన్ యామిన్' మా వెంట వస్తేనే మాకు రేషన్ దొరుకుతుంది. మీరు మా వెంట బిన్ యామిన్‌ను తప్పక పంపండి. మేమతన్ని కనిపెట్టియుంటామ"ని సంగతంతా తండ్రికి విన్నవించారు.

అందుకాయన, "ఇంతకు పూర్వం ఇతని సోదరుని (యూసుఫ్) విషయంలో మిమ్మల్ని నమ్మాను. మళ్ళీ ఇప్పుడు మిమ్మల్ని నమ్మాలా? వాస్త వానికి క్షేమంగా ఉంచేవాడు అల్లాహ్‌యే. ఆయనే దయజూపేవారందరిలోకెల్లా అధికంగా దయజూపేవాడు"అని చెప్పారు.

తరువాత వాళ్ళు తమ మూటల్ని విప్పి చూశారు. వారి డబ్బు మూటల్లోనే ఉండటం చూసి సంతోషంతో, "నాన్నగారూ ! ఇదిగో మన డబ్బు మనకే వాపసు ఇవ్వబడింది. చూడండి. ఇంతకంటే మనకేం కావాలి? మేం మళ్ళీ ఈజిప్ట్‌కు వెళతాం. సోదరుణ్ణి కూడా తీసుకెళతాం. అతని భద్రతకు మేము బాధ్యులం" అని అన్నారు. అందుకు తండ్రి:

"మీరు అల్లాహ్ మీద ప్రమాణం చేసి, అతన్ని క్షేమంగా వాపసు తెస్తామని వాగ్దానం చేసేవరకు మీ వెంట పంపను" అని అన్నారు.

సోదరులంతా ప్రమాణం చేశాక హజ్రత్ యాఖూబ్ (అ) తన కుమారులతో, "మన ఈ మాటలకు అల్లాహ్‌యే సాక్షి. కుమారులారా ! వినండి. మీరు ఈజిప్ట్ రాజధాని చేరాక, అందరూ ఒకే మార్గంలో కాకుండా వేర్వేరు మార్గాల్లో నగర ప్రవేశం చేయండి, అల్లాహ్ కోరిక నుండి మిమ్మల్ని తప్పించడం నా పరం కాదు. అసలు పాదుషా ఆయనే. నేను ఆయన్నే విశ్వసిస్తున్నాను. ప్రతి ఒక్కరూ ఆయన్నే విశ్వసించాల"ని హితబోధ చేశారు.

చూశారా ! విశ్వసించిన దాసుడు తన వంతు ప్రయత్నం ఎంత చేసినా భరోసా దైవం మీద మాత్రమే ఉంచుతాడు. ఇదీ అతనిలోని ప్రత్యేకత!!

సహనానికి మరో పరీక్ష

హజ్రత్ యూసుఫ్ (అ) గారి సోదరులు తమ తండ్రి సెలవిచ్చిన రీతినే ఈజిప్ట్ రాజధాని నగర ప్రవేశం చేశారు. కాని అల్లాహ్ ఆజ్ఞ ఏ విధంగా ఉందో ఆ విధంగానే జరుగుతుంది అని గుర్తుంచుకోవాలి. వీరి ప్రయత్నాలేమీ ఫలించలేదు. విశ్వాసి తన వంతు ప్రయత్నం తాను చేసినప్పటికీ నమ్మకం

అల్లాహ్ మీదే ఉంచుతాడు. అతడి ప్రయత్నం వల్ల అల్లాహ్ ఆజ్ఞ మారదని అతనికీ తెలుసు. అల్లాహ్ తలచినది జరిగితీరుతుంది.

వీళ్ళంతా హజ్రత్ యూసుఫ్ (అ) ఉన్న ప్రదేశం చేరారు. హజ్రత్ యూసుఫ్ (అ), బిన్ యామిన్‌ను పిలిపించి అన్నారు, "నేను నీ తమ్ముడిని, కనుక నీవు భయపడవద్దు. నీవు నా దగ్గరే ఉండు. ఈ సవతి సోదరులు చేసిన దానికి నీవేమీ చింతించకు."

ఇక్కడ సోదరుల మూటలన్నీ కట్టి సిద్ధం చేయబడ్డాయి. వీళ్ళు బయలుదేరేముందు ఎవరో పాదుషాగారి పాత్రనొకదాన్ని బిన్ యామిన్ సామానులలో పెట్టేశారు. అది వీరికి తెలియదు. వాళ్ళు బయలుదేరారు. కొంచెం దూరం వెళ్ళాక హజ్రత్ యూసుఫ్(అ) కార్యాలయంలో పాత్ర కోసం అన్వేషణ మొదలైంది. పాదుషాగారి నౌకర్లకు కంగారుపుట్టి ఆ సోదర బృందం వెళ్ళిన వైపునకే పరుగుతీశారు.

నౌకర్లు వాళ్ళను సమీపించి, "మీరు దొంగలు" అన్నారు. సోదరులు తడబడి, "మీ వస్తువేం పోయింది" అనడిగారు. పాపం వాళ్ళకేం తెలుసు? "పాదుషాగారి పాత్ర ఒకటి పోయింది. దాన్ని వెతికి తీసుకువచ్చినవాళ్ళకి ఒక ఒంటె మోసే బరువుకు సమానమయిన పంట (ధాన్యం) దొరుకుతుంది" అని వారిలో ఒకడన్నాడు.

వీళ్ళంతా ప్రమాణాలు చేయసాగారు. "మేము అలజడిని లేవదీయడానికి రాలేదని మీకు తెలుసు. మేము దొంగలంకాము" అన్నారు.

పాదుషా నౌకరు, "సరే ! మీ నేరం రుజువైతే ఏం శిక్ష విధించాలి?" అన్నాడు. అందుకు వాళ్ళు, "ఎవరి మూటలో మీ పాత్ర దొరికితే వాళ్ళని బంధించడమే శిక్ష. మా దేశంలో శిక్షించే విధానమిదే" అని బదులు చెప్పారు.

ఈ షరతుపై అందరి మూటలు వెదికారు. చివరకు బిన్ యామిన్‌గారి సామాన్లలో ఆ పాత్ర దొరికింది. వాళ్ళు చెప్పిన ప్రకారం బిన్ యామిన్ పట్టుబడ్డారు.

బిన్ యామిన్‌ని ఈజిప్ట్ న్యాయ చట్టాన్ననుసరించి శిక్షించడం ఏమీ సమస్య కాదు. హజ్రత్ యూసుఫ్ (అ) ప్రవక్తల సంతతికి చెందినవారు. ఇస్లామీయ ధర్మశాస్త్రం ప్రకారం నడిచేవారు. కాబట్టి అల్లాహ్ ఆయనకు సహాయపడి, రాజ భటుల మనస్సులో దొంగలను ఏ విధంగా శిక్షించాలో బిడారు వారినే అడిగే ఉద్దేశ్యం కలుగజేశాడు. ఈ విధంగా హజ్రత్ యూసుఫ్(అ)కు, ఇస్లామేతర న్యాయచట్టానికి అనుకూలంగా కాకుండా, తన షరీఅత్ కోరిన విధంగానే ఆయన అన్న బిన్ యామిన్‌ను బంధించే అవకాశం లభించింది. వీరు ఈజిప్ట్ పౌరులు కాకపోవడంచేత స్థానిక చట్టం ప్రకారంకాక, నేరస్థుల స్వదేశీ చట్టం ప్రకారమే శిక్షా విధానం అవలంబించే అవసరం కలిగింది. అల్లాహ్ తాను తలచిన విధంగా వారిని కటాక్షిస్తాడనేది సత్యం. ఆయన జ్ఞానం, అత్యంత గొప్ప మేధావుల జ్ఞానంకన్నా ఎన్నో రెట్లు గొప్పది.

పాదుషా పాత్ర బిన్ యామిన్ మూటలో దొరకడం చూసి ఈ సోదరులు కంగారుపడ్డారు. అయితే పైకి మాత్రం మాట చెల్లుబడి కోసం, "అతడు దొంగతనం చేయడంలో ఆశ్చర్యమేముందీ! అతని సోదరుడు (యూసుఫ్) కూడా దొంగే కదా!" అన్నారు.

తరువాత అందరూ కలసి హజ్రత్ యూసుఫ్ (అ)ను బ్రతిమాలడం మొదలెట్టారు. "ఈతని తండ్రి చాలా వృద్ధుడు. మీరు మా మీద దయ చూపుతున్నారు కదా! ఇతన్ని వదిలిపెట్టి బదులుగా మాలో ఒకరిని పట్టుకోండి. అతనిపై దయతల్చండ"ని పలికారు.

"అల్లాహ్ రక్షించుగాక! మా సొమ్ము పట్టుబడినవానిని వదలి మరొకర్ని ఎలా పట్టుకుంటాము? అలా చేస్తే నాకన్నా దుర్మార్గుడెవరుంటారు?" అన్నారు హజ్రత్ యూసుఫ్(అ).

వారంతా నిరాశతో ఒక ప్రక్కగా పోయి పరస్పరం సంప్రతింపులు చేయసాగారు. అందరికన్నా పెద్దవాడు ఇలా అన్నాడు, "చూడండి! మీరంతా తండ్రిగారి యెదుట అల్లాహ్ సాక్షిగా ప్రమాణాలు చేసి ఉన్నారు. లోగడ

యూసుఫ్ (అ) విషయంలో చేసినదంతా దృష్టిలో పెట్టుకోండి. ఈ పరిస్థితుల్లో మన తండ్రి ఆజ్ఞాపించే వరకు లేదా అల్లాహ్‌యే మరేదయినా దారి చూపే వరకు, నేను మాత్రం ఇక్కణ్ణించి తిరిగి వెళ్ళను. మీరు తండ్రిగారి దగ్గరికెళ్ళి, "నాన్నగారూ! మీ అబ్బాయి దొంగతనం చేశాడు. మాకు తెలిసినది మీకు చెప్పాము. అదృశ్య విషయాలు మాకేం తెలుస్తాయి? ఒకవేళ మీకు నమ్మకం కలగకపోతే మేము వెళ్ళిన ఊరువారినిగాని, మాతో వచ్చిన బిడారు వారినిగాని విచారించండి. మేము సత్యం పలుకుతున్నాం" అని చెప్పండి.

ఈ సలహా విని మిగిలినవాళ్ళు ఇల్లు చేరి తండ్రితో పూర్తి సంగతి చెప్పారు. అంతా విని తండ్రి యఖూబ్ (అ), "మీరు మరో పెద్ద మాట సులభం చేసుకున్నారు. బిన్ యామిన్‌ని దొంగగా మీరు భావించటంలో ఆశ్చర్యం ఏమీ లేదు. సరే! నేను మాత్రం ఓర్పు వహిస్తాను. అల్లాహ్ వారిద్దరినీ నా దగ్గరకు చేర్చుతాడేమో! ఆయన సమస్తమూ తెలిసినవాడు, ఆయన పని వివేకంతో కూడినది కదా!" అని 'హా! యూసుఫ్!' అంటూ నిట్టూర్చారు. కుమారుల వైపు నుండి ముఖం త్రిప్పుకుని లోలోనే కుమిలిపోసాగారు. ఇద్దరు కుమారుల ఎడబాటుతో ఏడ్చీ ఏడ్చీ ఆయన కండ్లు కాంతిహీనమైపోయాయి. కుమారులది చూసి, "అల్లాహ్ తోడు! మీకు యూసుఫ్(అ) జ్ఞాపకం వచ్చినప్పుడల్లా కుమిలి కుమిలి మీ ప్రాణం మీరే తీసుకుంటారు" అన్నారు.

ఇది విని ఆయన(అ), "నేను నా దుఃఖపు ఫిర్యాదును అల్లాహ్‌కు తప్ప ఇతరులకు చేయను. అల్లాహ్ విషయంలో నేను ఎరిగినంతగా మీరెరుగరు. నా పుత్రులారా! వెళ్ళండి. యూసుఫ్, బిన్ యామిన్‌ల జాడ కనుక్కోండి. దైవ కృప పట్ల నిరాశ చెందకూడదు. దైవం పట్ల విశ్వాసం లేనివారు మాత్రమే నిరాశపడతారు" అన్నారు.

నా స్వప్న వృత్తాంతానికి అర్థమిదే

తండ్రి మాటపై యూసుఫ్ (అ) సోదరులు తిరిగి ఈజిప్ట్ చేరారు. యూసుఫ్ (అ) దర్బారులో ప్రవేశించి, "అయ్యా! మేము, మా ఇంటిలోనివారు

కష్టాల్లోనున్నాము. మా దగ్గర మిగిలి ఉన్న కొద్దో గొప్పో పెట్టుబడిని తీసుకు వచ్చాము. మీరు మాకు పూర్తి ధాన్యాన్ని ఇప్పించండి. ఇంకా మాకు దానం చెయ్యండి. అల్లాహ్ దానమిచ్చేవాళ్ళకు మంచి ప్రతిఫలం ఇస్తాడు" అన్నారు. హజ్రత్ యూసుఫ్(అ) తన ఇంటివారి పరిస్థితిని తెలుసుకుని వ్యాకులపడ్డారు.

"అది సరే, అజ్ఞానంలోపడి మీరు యూసుఫ్, అతని అన్న విషయంలో ఏమేమి చేశారో గుర్తుందా?" అని ప్రశ్నించారు.

వాళ్ళు ఆ మాటలు విని, "హా! మీరే యూసుఫ్ కాదు కదా!?" అని సంభ్రమాశ్చర్యాలతో అడిగారు.

"అవును, నేనే యూసుఫ్‌ను. ఇతడు (బిన్ యామిన్) నా సోదరుడు. అల్లాహ్ మా మీద దయ చూపాడు. అసలు విషయమేమంటే, ఎవరయితే దైవధిక్కారం చేయక, దేవునికి భయపడి సహనంతో కష్టాలనెదుర్కుంటారో, దేవుని వద్ద అటువంటి మంచివారి ప్రతిఫలం వృథాపోదు"అని యూసుఫ్(అ) జవాబిచ్చారు.

అప్పుడు వారు, "అల్లాహ్ తోడు! అల్లాహ్ మాపై మీకు శ్రేష్ఠతను ప్రసాదించాడు. నిజంగా మా వల్ల గొప్ప పొరపాటు జరిగింది" అని ఒప్పుకున్నారు.

హజ్రత్ యూసుఫ్ (అ), "వెళ్ళండి, మిమ్మల్నంతా విడిచిపెట్టడం జరిగింది. మీ మీద ఏ విధమయిన నిర్బంధం లేదు. అల్లాహ్ మిమ్మల్ని క్షమించుగాక! ఆయన అందరికంటే ఎక్కువ దయ చూపేవాడు. ఇదిగో ఈ చొక్కాను తీసుకెళ్ళి నాన్నగారి మొహంపై వెయ్యండి. ఆయన కళ్ళు కాంతి మంతమవుతాయి. ఇక ఇంట్లోనివారందరినీ ఇక్కడకు తీసుకురండి" అని వాళ్ళని పంపించారు.

ఇటు ఈ అన్నదమ్ములంతా ఈజిప్ట్ నుండి బయలుదేరారు. అటు వాళ్ళ తండ్రి యాఖూబ్(అ) ఇంట్లో కూర్చుని అంటున్నారు, "నాకు యూసుఫ్(అ) పరిమళం వస్తున్నది. నేను వృద్ధాప్యంలో భ్రమపడుతున్నానని అనుకోకండి."

ఇది విని ఇంట్లో ఉన్నవారంతా, "దైవసాక్షిగా మీకు మతిభ్రమించింది. మీరు ఇంకా పాపం పిచ్చిలోనే ఉన్నార"ని అన్నారు.

వాళ్ళ మాటలకు యాఖూబ్ (అ) వూరుకున్నారు. కొన్ని రోజుల తర్వాత బిడారు "కన్అన్" పట్టణం చేరిన వెంటనే సంతోషకరమయిన వార్తను తీసుకువచ్చిన సోదరులు యూసుఫ్(అ) గారి చొక్కాని ఆయన తండ్రి ముఖంపై వేశారు. వెంటనే ఆయన కళ్ళు వెలుగొందాయి. అప్పుడాయన అన్నారు, "చూశారా! నేను మీకు చెబుతుండేవాడిని కదా! మీరెరుగని విషయాలను గురించిన జ్ఞానం దైవం నాకిచ్చి ఉన్నాడని."

"నాన్నగారూ! మా తప్పుని మన్నించండి, మా పాప పరిహారానికై అల్లాహ్‌ని ప్రార్థించండి. మా వల్ల గొప్ప అపరాధం జరిగింది" అని వాపోయారు ఈ పది మంది సోదరులు.

హజ్రత్ యాఖూబ్ (అ), "మిమ్మల్ని క్షమించవలసిందిగా నేను దైవాన్ని ప్రార్థిస్తున్నాను. ఆయన అమితంగా క్షమించేవాడు, అపార కృపాశీలుడు" అని పలికారు.

తరువాత అందరూ కలసి ఈజిప్టుకు ప్రయాణమయ్యారు. హజ్రత్ యూసుఫ్(అ)కి వీరి రాక గురించి తెలియగానే నగరం బయటకు వచ్చారు. వీళ్ళంతా సమీపించాక, హజ్రత్ యూసుఫ్(అ) తల్లిదండ్రుల్ని ఎంతో గౌరవంతో తన ప్రక్కన కూర్చోబెట్టుకున్నారు. మీరంతా నగరంలోకి పదండి. దైవం తలిస్తే అక్కడ అంతా సుఖంగా ఉంటారు అని తన కుటుంబం వారికి చెప్పారు.

నగరంలోనికి రాగానే హజ్రత్ యూసుఫ్ (అ) తన తల్లిదండ్రుల్ని సింహాసనం మీద కూర్చోబెట్టారు. అప్పుడందరూ విధేయతతో హజ్రత్ యూసుఫ్(అ) గారికి అభివందనాలు చేశారు.

అది చూసి హజ్రత్ యూసుఫ్ (అ), "నాన్నగారూ! నేను లోగడ చూసిన కలకు అర్థమిదే! నా కల నిజమని దైవం నిరూపించాడు. ఆయనే నన్ను చెరసాల

నుండి తప్పించాడు. షైతాన్ మా సోదరుల మధ్య విభేదాలు కల్పించినా, అందరినీ తిరిగి నాతో కలిపాడు. నా ప్రభువు తాను తలచినది, మూడో కంటికి తెలియకుండా పూర్తిచేస్తాడు. ఈ విషయం ఎవరికీ తెలియదు. ఇది సత్యం, నిస్సందేహంగా ఆయన అన్నీ ఎరిగినవాడు, వివేకవంతుడు" అన్నారు.

ఆ తర్వాత హజ్రత్ యూసుఫ్ (అ) ఇలా ప్రార్థించారు: "ఓ నా ప్రభూ! నీవు నాకు రాజ్యాధికారాన్నిచ్చావు. మాటల లోతుల్ని తెలుసుకునే జ్ఞానాన్ని నాకు అనుగ్రహించావు. ఓ భూమ్యాకాశాల నిర్మాతా ! ఇహపరములలో నా కార్యసాధనకు నీవే తోడ్పడాలి. నీవే కడకు నన్ను నీ మార్గం (ఇస్లామ్)లో అంతంచేసి నన్ను సజ్జనుల (దైవ భక్తుల) జాబితాలో చేర్చు."

మరువరాని మంచి మాటలు

(1) మానవులది అల్ప జ్ఞానం. అతడు ఎల్లప్పుడూ చెడుగా భావించే విషయాలే ఒక్కోసారి అతనికి లాభదాయకములవుతాయి. లాభసాటిగా భావించినవాటి కొరకు మానవుడు పరుగులు తీస్తాడు. కాని నిజానికి అవే అతనికి నష్టం కలిగిస్తాయి.

(2) దైవ కటాక్షం కోసం కష్టాలను, నష్టాలను ఓర్పుతో సహించి, సదా దైవాజ్ఞల్ని పాలిస్తూ ఉంటే, తరచుగా కలిగే ఆ కష్టాలే ఏదో ఒక గొప్ప విజయానికి కారణమవుతాయి.

(3) ఒక వైపు దైవధిక్కారం చేసే మానవుడికి భోగభాగ్యాలు లభిస్తే, మరో వైపు దైవాజ్ఞల్ని పాటిస్తూ కూడా కష్టాలపాలవ్వాల్సి వస్తుంది. ఆపద సమయంలో కూడ విశ్వాసి భోగభాగ్యాల్ని విడనాడి దైవాజ్ఞల్ని పాటించడానికే సిద్ధపడతాడు. కారణమేమంటే, పరలోక సుఖమే శాశ్వతమయినది మరియు వాస్తవమైనది. అంతేకాక ప్రాపంచిక కష్టనష్టాలు ఎంత ఎక్కువగా ఉన్నా అవి ఒకానొక రోజున అంతమవుతాయని దృఢ నమ్మకం అతనికి ఏర్పడుతుంది.

(4) దైవభక్తిపరులయిన దాసులకు పరలోకంలో వారి సత్కార్యాలకు ప్రతిఫలంగా ముక్తి, మోక్షాలనివ్వడమేకాక, ఇహలోకంలో కూడ వారికి శాంతి

సౌఖ్యాలు అల్లాహ్ ప్రసాదిస్తాడు. విశ్వాసి అయిన భక్తుడు దైవ ప్రసాదిత వరాల్ని పొంది, ఇంకా ఎక్కువగా దైవం వైపు మ్రొగ్గి నిత్యం ఆయన ప్రసన్నత బడయటమే ధ్యేయంగా పెట్టుకుంటాడు.

(5) ప్రపంచంలో మంచినీ, మానవత్వాన్నీ వ్యాపింపజేయగోరేవారు తమ తమ నిజ జీవితాలలో అన్నిరకాల చెడుల నుండి పరిశుద్ధులవ్వాలి. ప్రజలకు అటువంటి వారితో అవసరం వచ్చినప్పుడు, వారిని చూసి, "ఎంత మంచివారో" అని అనిపించుకునేటంత ఉన్నతంగా వ్యవహరించాలి.

(6) మానవులకు మంచి మాటలు విన్పించడానికి, వారిని శ్రేయస్కర మార్గం వైపు మరల్చడానికి అనువైన సమయ సందర్భాలలో హితోపదేశం చేయాలి. సందర్భానుసారం విషయాన్ని స్పష్టంగా వారి ముందుంచాలి.

(7) విశ్వాసి షరీఅత్‌ను వ్యతిరేకించి ఏ మార్గాన్నీ అవలంబించజాలడు. ముఖ్యంగా ధర్మసంస్థాపనాపరులు ఆ విధంగా చేయలేరు.

(8) అగోచర విషయాలకు సంబంధించిన జ్ఞానం అల్లాహ్‌కు తప్ప ఇతరులకు లేదు. అయితే అల్లాహ్ తన ఇష్టానుసారం తన ప్రవక్తలకుగాని, విశ్వాసులయిన భక్తులకుగాని ఏ విషయం గురించైనా తెలియజేస్తాడు. హజ్రత్ యాఖూబ్ (అ) దాదాపు ఇరవై రెండు సంవత్సరాలుగా పుత్రశోకంతో బాధపడ్డారు. ఆయనలో యూసుఫ్ (అ)ను గురించి తెలుసుకునే శక్తి లేదు. కాని అదే యాఖూబ్ (అ) చొక్కాను తీసుకుని బయల్దేరాక, వందల మైళ్ళ దూరంలో తన యింట్లో కూర్చునియుండగా కుమారుని శరీర వాసన ఆయన నాసిక పుటాలకు తగలింది కదా! అంతకంటే వేరే నిదర్శనం ఏం కావాలి?

(9) సదా మంచిని పెంచి, చెడును నిర్మూలించడం ఒక విశ్వాసి జీవిత ధ్యేయం. అతడు కష్టాలలో ఉన్నా, నష్టాలలో ఉన్నా, అత్యంత క్లిష్ట పరిస్థితులలో ఉన్నా ఈ పనే చేస్తాడు. అంతులేని సిరిసంపదలున్నా తన ఈ బాధ్యతని విస్మరించడు. హజ్రత్ యూసుఫ్ (అ) కారాగారంలో ఉన్నప్పుడు కూడ తోటివారికి దేవుని ఏకత్వాన్ని గురించి బోధించి వారిని పరలోక జీవనం వైపునకు

ఆహ్వానించారు. అధికారం చేతిలో ఉండి కూడా దైవధర్మ సంస్థాపనకే తన శక్తిమంతా ధారపోశారు.

(10) దైవం పట్ల భయభక్తులుగలవారు, తమ వ్యక్తిగత విరోధులపై పగతీర్చుకునే పూర్తి శక్తి ఉన్నప్పటికీ, వారి అపరాధాల్ని మన్నిస్తారు. స్వార్థం కోసం ఎవరినీ కష్టపెట్టరు. ధర్మానికి అండగా ఉన్నప్పుడు అవసరమయిన సమయంలో కేవలం దుష్టశిక్షణకే వారి చెయ్యి పైకి లేస్తుంది.

(11) ప్రార్థనే (దుఆ) విశ్వాసికి గొప్ప బలం. హజ్రత్ యూసుఫ్(అ) గారి ప్రార్థన మరొకసారి శ్రద్ధగా చదవండి. వీలయితే పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఆ ప్రార్థనకు సంబంధించిన "అరబ్బీ" పదాలు చదివి, వాటి అనువాదం చూస్తే, సకల వరాలు పొందిన తరువాత విశ్వాసి తన సంబంధ బాంధవ్యాలు అల్లాహ్‌తో ఎలా జోడిస్తాడో మీకు తెలుస్తుంది.

మీరూ ఆ ప్రార్థనని కంఠస్థం చేయండి.

-: సమాప్తం :-